అడుగుకో గుంత - తీరదు చింత!

- సీసీరోడ్లపై భారీగా గుంతలు
- పట్టణవాసులకు చిక్కులు
- మొత్తం 142 కిలోమీటర్ల సీసీరోడ్లు
- అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు
- గత ఎన్నికల్లో వీటిపై వ్యతిరేకంగా ప్రచారం
- త్వరలో ప్యాచ్ వర్క్ పనులు చేస్తామంటున్న కమిషనర్


ప్రకాష్‌నగర్ టౌన్‌హాలు మూలమీద డీఎస్పీ బంగ్లాకు వెళ్లే దారిలో ఏర్పడిన గుంత

నరసరావుపేట: సాఫీగా సాగే జీవితంలో అకస్మాత్తుగా వచ్చే ఒడిదుడుకులను పోలినట్లుగా పట్టణంలోని సీసీరోడ్లపై ఏర్పడిన గుంతలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా వాహనదారులు వేగంగా ప్రయాణించే సమయంలో అకస్మాత్తుగా ఎదురుపడిన గుంతల మీదుగా ప్రయాణించటం ప్రమాదాలకు దారీ తీస్తోంది. పట్టణంలోని పలు రోడ్లలో అక్కడక్కడా ఇటువంటి గుంతలు దర్శనమిస్తున్నాయి. 2000 ఏడాది తర్వాత పట్టణంలో సీసీరోడ్ల నిర్మాణం ఊపందుకుని ఇప్పుడు పట్టణ శివారులలో తప్పించి మిగతా ప్రతి రహదారి సీసీరోడ్డుగా మారింది. ముఖ్యంగా 2004 నుంచి 2009 మధ్యకాలంలో పట్టణంలోని రోడ్లలో 90 శాతం రోడ్లను సీసీరోడ్లుగా అభివృద్ధి చేశారు. గత నాలుగైదు ఏళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పురపాలక పరిధిలో కలిసిన ఐదు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైతం సీసీ రోడ్ల నిర్మాణం చోటు చేసుకుంది. ఇప్పటికీ వివిధ వీధుల్లో 142 కిలోమీటర్ల సీసీరోడ్లు ఉన్నాయి. 2008లో భూగర్భ డ్రెయినేజ్ స్కీం (యుజీడీ)లో భాగంగా పైపులు వేసే క్రమంలో అప్పటివరకు వేసిన సీసీ రోడ్లను మధ్యలో పగులకొట్టి పైపులు వేసి మళ్లీ ఆ గుంతలను పూడ్చారు. కాలక్రమంలో ఇప్పుడవి చాలా రోడ్లలో పగులకొట్టి పూడ్చిన చోట కుంగి రాకపోకలు సాగించే వారికి ఇబ్బందికరంగా మారింది. వీటిని సరిచేసే ప్రక్రియ ఎక్కడా జరగలేదు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చే ప్యాచ్ వర్క్ పనులు 2017లో ఒకసారి చేపట్టారు. మళ్లీ కాలక్రమంలో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వైఎస్సార్ సీపీ పాలనలో పలుమార్లు గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. అయినప్పటికీ గుంతలు అక్కడక్కడా కన్పిస్తూనే ఉన్నాయి. ప్రకాష్‌నగర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయ సెంటర్, టౌన్‌హాలు సెంటర్, బరంపేట, 60 ఫీట్‌రోడ్డు, చిలకలూరిపేట రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద, మెయిన్‌రోడ్డు శివునిబొమ్మ సెంటర్, మల్లమ్మసెంటర్, మల్లమ్మ సెంటర్ ఆర్వోబీపైన, సత్తెనపల్లి రోడ్డు సెంటర్, ఆవులసత్రం, రామిరెడ్డిపేట పాతసమితి కార్యాలయ రోడ్డు, వైఎస్ రాజశేఖరరెడ్డి రహదారి, రామిరెడ్డిపేట పాత పోస్టాఫీసు సెంటర్‌లతో పాటు పలుచోట్ల గుంతలు కన్పిస్తున్నాయి. వర్షం పడిన సమయంలో ఇవి నీటితో నిండి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. గత ప్రభుత్వంలో రోడ్లు పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వస్తే రోడ్లన్నీ శుభ్రంగా ఉంచుతామన్న కూటమి నేతల మాటలు నాలుగు నెలలు గడుస్తున్నా ఆచరణకు నోచుకోకపోవటంపై ప్రజల నుంచి విమర్శలు విన్పిస్తున్నాయి.


సత్తెనపల్లిరోడ్డు నుంచి బరంపేటకు వెళ్లేదారిలో ఏర్పడిన గుంతలు

అంచనాలు వేస్తున్నాం



పట్టణంలోని పలు మార్గాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు అంచనాలు తయారు చేయమని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించాం. అవి పూర్తికాగానే టెండర్లు పిలిచి ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి రోడ్లు బాగు చేస్తాం.

–ఎం.జస్వంతరావు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



చిలకలూరిపేట: సరస్వతీదేవి జన్మదినమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పెదనందిపాడురోడ్డులో ఉన్న వికాస్ స్కూల్‌లో బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. బాసర నుంచి తెప్పించిన పలకలు, బలపాలు, అక్షింతలతో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. 100 మందికి పైగా చిన్నారులను ఈ అక్షరాభ్యాస కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు తీసుకువచ్చారు. కార్యక్రమంలో వికాస్ స్కూల్ డైరెక్టర్ దండా పవన్, ప్రిన్సిపాల్ కల్పనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలేరమ్మ అమ్మవారి విగ్రహప్రతిష్టా మహోత్సవం



చిలకలూరిపేట: మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ అమ్మవారి దేవాలయంలో పోలేరమ్మ, పోతురాజు, విమాన శిఖరం ప్రతిష్టా మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. ఆయన వెంట సోమేపల్లి వెంకటసుబ్బయ్య, చాపలమడుగు రామకృష్ణ, మాలెంపాటి సత్యనారాయణ, గడిపూడి పవన్‌కుమార్, యలమంచలి లీలాప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైభవంగా చండీహోమం



చిలకలూరిపేట: అశ్వయుజ శుద్ధ సప్తమి, సరస్వతి అమ్మవారి పుట్టిన రోజు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గంగా పార్వతీ సమేత ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో చండీహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవి అలంకారంగావించారు.

పల్లె పండుగ విజయవంతం చేయండి

శావల్యాపురం: పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలు విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ జాతీయ ఉపాధి పథకం నిధులతో ఈనెల 14 నుంచి 26 వరకు ప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ. 2 కోట్ల 33 లక్షల 95 వేల వ్యయంతో గుర్తించిన 20 రకాల పనులను సంక్రాంతి పర్వదినం లోపు నూరు శాతం పూర్తి అయ్యేలా క్షేత్ర స్థాయి పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే మిని గోకులం షెడ్లు, ఉద్యాన పంట సాగు, నీటి కుంటలు తదితర అభివృద్ధి పనులు అనుకున్న లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో షేరుమీనా సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి రెండు రోజుల శిక్షణ

బొల్లాపల్లి: స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపసర్పంచ్‌తో పాటు ఇరువురు వార్డు మెంబర్ల (స్త్రీ, పురుషుడు)కు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పంచాయతీల అభివృద్ధికి పాలకవర్గం పాత్ర ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య మెరుగుదల, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక వంటి అంశాలపై శిక్షణ నిర్వహించారు. శిక్షణలో మన్నేపల్లితండా, గండిగనుమల, రేమిడిచర్ల, అయ్యన్నపాలెం, మేళ్లవాగు, లాలిపురం, రెడ్డిపాలెం, గుమ్మనంపాడు తదితర పంచాయతీలకు చెందిన ఉపసర్పంచ్, ఇరువురు వార్డు మెంబర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏసీఏ అండర్-14 బాలుర క్రికెట్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కెఆర్‌బిఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈనెల 10వ తేది నుంచి ఏసీఏ గ్రూప్ బి అండర్–14బాలుర క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు బుధవారం తెలిపారు. పోటీలలో శ్రీకాకుళం, అనంతపురం, నెల్లూరు, విజయనగరం, కృష్ణా, గుంటూరు జిల్లాల జట్లు పాల్గొంటాయని వివరించారు.

పట్టభద్రులూ.. ఓటు హక్కు నమోదు చేసుకోండి

యూటీఎఫ్ కేంద్రంలో నమోదు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


దరఖాస్తును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ ప్రతినిధులు

నరసరావుపేట: వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే గుంటూరు, కృష్ణా జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు 2022నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆ నియోజకవర్గ ప్రస్తుత పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రైతులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని చెప్పారు. గత ఆరేళ్లుగా అనేక ఉద్యమాల్లో పాల్గొని పరిష్కరించామన్నారు. నవంబరు ఆరోతేదీ వరకు ఓటర్లుగా నమోదు కావొచ్చన్నారు. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యాలయంలో నమోదు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అందరూ ఈ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ యూటీఎఫ్ తరపున ప్రతి మండల కేంద్రంలో పట్టభద్రులు ఓటర్లుగా నమోదుచేసేందుకు ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేశామన్నారు. దరఖాస్తులు దాఖలు చేసేందుకు ఆన్‌లైన్, హాఫ్‌లైన్ ద్వారా సహాయం చేస్తుందన్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న లక్ష్మణరావుకు యూటీఎఫ్ మద్దతు పలికిందన్నారు. పట్టభద్రులు చైతన్యవంతులై లక్ష్మణరావుకు మద్దతు తెలియచేయాలని కోరారు. ఈసందర్భంగా ధరఖాస్తులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అమ్మ దయతో రాష్ట్రాభివృద్ధి జరగాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


పాతూరు శివాలయాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


నరసరావుపేట: అమ్మవార్ల దయతో రాష్ట్రం అభివృద్ధి చెందుతూ ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం రాత్రి పట్టణంలోని పాతూరు శివాలయంగా పిలిచే శ్రీ పార్వతీ సమేత శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవాలయం, శ్రీ కన్యకాపరమేశ్వరి, శ్రీ విజయ చాముండేశ్వరీదేవి ఆలయాల్లో శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో ఉన్న శ్రీ పార్వతీదేవి, శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు స్వీకరించి తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజలందరికీ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. పాతూరు శివాలయంలో 92వ అమ్మవారి ఉత్సవాలు నిర్వహించుకోవటం అభినందనీయమన్నారు. ప్రజలు అందరూ మంచి మార్గంలో నడుస్తూ విజయపథంలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేపీ రంగారావు, మిట్టపల్లి రమేష్, మద్ది రామబ్రహ్మానందరావు, సుబ్రమణ్యం, కొత్తమాసు మల్లారావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, కోటి, నాగూల్‌మీరా తదితర భక్తులు పాల్గొన్నారు.

చదువులమ్మా.. వందనమమ్మా..


శావల్యాపురంలో..


నరసరావుపేట చౌడేశ్వరీ ఆలయంలో...


రొంపిచర్లలో


వడ్డెంగుంటలో ..


రవ్వవరంలో..


నరసరావుపేట పార్వతీ అమ్మవారి ఆలయంలో...


గణపవరంలో..


శాంతినగర్‌లో

సమాజ మార్గదర్శి సాహిత్యమే

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


రచయిత సోమన్నను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: సమాజాన్ని మంచి వైపు నడిపిస్తూ మార్గదర్శకంగా నిలిచేది సాహిత్యమేనని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో బుధవారం బాలల సాహిత్యవేత్త కర్నూలు జిల్లాకు చెందిన గద్వాల సోమన్న రచించిన 56వ పుస్తకం చిట్టి చిట్టి కమలాలును ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఆవిష్కరించి మాట్లాడారు. రచయిత సోమన్న తన చిట్టి చిట్టి కమలాలు పుస్తకాన్ని కో–ఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డికి అంకితమిచ్చారు. పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి బాల గేయాలను ఆలపించి అలరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ కాకాని సుధాకర్, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్ పాల్గొన్నారు.

ఈశ్వర్‌లో దసరా వేడుకలు


బతుకమ్మల వద్ద నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో దసరా వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సాంప్రదాయ దుస్తులతో ఉత్సవాల్లో సందడి చేశారు. విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మకు పూజలు నిర్వహించారు. బతుకమ్మలను ఒక చోట ఉంచి పాటలకు డాన్స్‌లు చేశారు.

అమ్మవారి తొమ్మిది అవతారాలతో విద్యార్థినులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఉట్టి కొట్టే పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాలలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, కరస్పాండెంట్ షేక్ కరీంమొహిద్దీన్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


మహిషాసురమర్దిని నృత్యరూపకంలో విద్యార్థినులు

ఈ సందర్భంగా కళాశాల ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటామని తెలిపారు.



వినుకొండలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి 600 మంది విద్యార్థినులు మంగళవారం పూజలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారులై తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మను అర్చించారు.

-వినుకొండ

బాల్‌బ్యాడ్మింటన్‌కు శావల్యాపురం విద్యార్థి


కావ్య

శావల్యాపురం: జాతీయ స్థాయి బాలికల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు శావల్యాపురం హైస్కూలు విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ పాఠశాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కామినీడి కావ్య ఈనెల 5 నుంచి 7 వరకు విశాఖపట్టణం జిల్లా నునపర్తిలో జరిగిన జూనియర్ బాలికల (అండర్–19) బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈపోటీల్లో గుంటూరు బాలికల జట్టు నాల్గవ స్థానం సాధించగా ఈపోటీలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన కావ్యను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేశారు. అక్టోబరు నెలలో నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు కామినీడి కావ్య పాల్గొంటుందని పీడీ రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఈసందర్భంగా మంచి ప్రతిభ చూపిన కావ్యకు స్టార్ ఆఫ్ ఆంధ్ర బెస్ట్ ప్లేయర్ అవార్డును పొందింది. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఈ.శివశంకరు, అధ్యక్షులు ఆనంద ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, కిరణ్మయి, బాలికల జట్టు మేనేజరు ఝాన్సీ అభినందించారు.

పోస్టాఫీసుల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

నరసరావుపేటటౌన్: తపాల వారోత్సవాల సందర్భంగా గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి బుధవారం తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు, ఫోన్ నంబర్ లింక్ చేసుకోవచ్చన్నారు. నూతన ఆధార్ కార్డు నమోదును ఉచితంగా చేస్తారన్నారు. ఈ సేవలను మాచర్ల, కొలగుట్ల, పెదపాలెం, ఒప్పిచర్ల పోస్టాఫీసుల్లో పొందవచ్చు అన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాపారులు పరిశుభ్రత పాటించాలి

నరసరావుపేట: వ్యాపారులు తమ దుకాణాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వారి లైసెన్స్ రద్దుచేయించి తగిన జరిమానా విధించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలువీధుల్లో పర్యటించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వార్డు పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు రోడ్డు మార్జిన్లలో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, చెట్ల కొమ్మలు తదితర చెత్తను వెంటనే తొలగించి శుభ్రం చేయించాలని కోరారు. అదే విధంగా వర్తక, వాణిజ్య వ్యాపారులు, టీషాపులు, టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్ల నిర్వాహకులు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి రెండు బుట్టల విధానం అనుసరిస్తూ పురపాలకసంఘం వారికి అప్పచెప్పాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ఆర్డీవో మధులత


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

నాదెండ్ల: రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సామాన్యులకు మెరుగైన సేవలందించాలని నరసరావుపేట ఆర్డీవో మధులత చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏవీ రమణ, సర్వేయర్, వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి వారం గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. భూముల రీసర్వే విషయంలో రైతులు నుంచి అందిన అర్జీలను పరిశీలించి వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. వివిధ రకాల ధృవీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్‌లో అందే దరఖాస్తులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. అలాగే నాదెండ్ల డిప్యూటీ తహసీల్దార్‌గా ధనలక్ష్మీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

పొలంబడిలో సస్యరక్షణ పాఠాలు


ఇక్కుర్రులో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నరేంద్రబాబు


చిలకలూరిపేట నియోజకవర్గంలో పత్తి పంట పరిశీలిస్తున్న లాంఫాం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

- వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పొలంబాట
- రైతులకు సలహాలు, సూచనలు

చిలకలూరిపేట: పత్తి పంటలో గులాబీ పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని లాంఫాం శాస్త్రవేత్త రాజామణి తెలిపారు. మండలంలోని గంగన్నపాలెం, కోమటినేని వారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లాంఫాం, జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజామణి మాట్లాడుతూ గులాబీ పురుగు నివారణకు ఎకరానికి పది చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడుతూ 30 రోజుల తర్వాత పంటకు పైపాటుగా కాంప్లెక్స్, డీఏపీ ఎరువులను వాడటం వలన మొక్కకు అందాల్సిన సూక్ష్మ పోషకాలు అందకుండా సూక్ష్మధాతు లోపాలు కనిపిస్తాయని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్తలు నరేష్ కుమార్, మనోజ్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త వెంకటరాములు, ఏడీఏ పి.మస్తానమ్మ, ఏవో టి.శ్రీలత, ఏఈవో జీపీ శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

వినుకొండ పరిధిలో...

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని వ్యవసా య, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పువ్వాడ, పాతకొత్త పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కంది, వరి, మినుము పంటలను క్షేత్రసందర్శన చేసి రైతులతో రైతు సేవా కేంద్రాల వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుగుణాబేగం మాట్లాడుతూ కంది పంటలో వెర్రి తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంది నాటిన 30 - 60 రోజుల సమయంలో నల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం ఎకరానికి 600 గ్రాములు లేదా ఒమైట్ ఎకరానికి 400 మిల్లీలీటర్ల చొప్పున పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కోటేశ్వరరావు, మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్ అమీర్ బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరిపైరులో ఆకుచుట్టు పురుగు నివారించాలి

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి, రొంపిచర్ల గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత తరుణంలో వరిపైరులో ఆకుచుట్టు పురుగు కనిపిస్తుందన్నారు. ఈ పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే మిరపపైరులో ఏరుకుళ్లుడు తెగులు కనిపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, వీఏఏలు అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకుముడతను నివారించాలి

నరసరావుపేట రూరల్: వరిలో ఆకుముడత పురుగు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, సిబ్బంది పరిశీలించి ఆకుముడత పురుగును గుర్తించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొడ్డపాటి పేరయ్య, సొసైటి సీఈవో కంటు శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకుడు జి.రవితేజ, రైతులు పాల్గొన్నారు.